ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ



భూమి పూజలో ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయం విస్తరణ, పునఃనిర్మాణ పనులకు ఎమ్మెల్యే గాంధీ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్ గౌడ్, కాలనీ వాసులు పవన్‌గౌడ్, రమేష్ గౌడ్, నరేందర్ గౌడ్, కృష్ణ, శ్రీనివాస్, పరమేష్, బెనర్జీ, వెంకట్ చారి, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

చెట్లు కొట్టివేశారంటూ ఫిర్యాదు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో దాదాపు 30 చెట్లను కొట్టివేశారంటూ ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నిసర్గ ఆదివారం ఫిర్యాదు చేసినట్లు జీహెచ్ఎంసీ, అటవీశాఖ అధికారులు తెలిపారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి అనుమతి లేకుండా చెట్లను కొట్టివేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఆకులు రాలుతుంటే తొలగించేందుకు మనుషులను ఏర్పాటు చేయాలే కానీ చెట్లను కొట్టివేయడమేమిటని పలువురు అంటున్నారు.

రేణుక ఎల్లమ్మ తల్లి జాతర

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి, రేణుక ఎల్లమ్మ తల్లి జాతరలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచులు మల్లేష్, కృష్ణ, రాజు, ఆలయ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



గచ్చిబౌలి: జనగణనతో పాటు కులగణన చేయాలని ప్రధాని నరేంద్రమోడీ తలపెట్టిన చరిత్రాత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ ఆదివారం శేరిలింగంపల్లి డివిజన్ పార్టీ కార్యాలయం మసీదుబండ వద్ద ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి తీసుకున్న నిర్ణయంతో అన్ని వర్గాల వారికి న్యాయం జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్, రాధాకృష్ణయాదవ్, సోమయ్యయాదవ్, శ్రీనివాస్, అరవింద్, రాజేష్, కిషోర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

వడగళ్ల వర్షం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సాయంత్రం పలుచోట్ల వడగళ్ల వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో వాహనదారులు భయపడ్డారు. గాలుల ధాటికి రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న డా.రాజేష్

చందానగర్: మియాపూర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలో చలివేంద్రంను ఆదివారం కల్వరి టెంపుల్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పి.రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలం ప్రజల దాహార్తి తీర్చడానికి ఉపయోగపడుతుందన్నారు.

కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పాటి గ్రామ పరిధి చర్చి సమీపంలో నూతన కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్, చర్చి నిర్వాహకులు భాస్కరరావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది మొత్తం బురదమయమే

నానక్‌రాంగూడలో అంతర్గత రోడ్డు దుస్థితి • భూగర్భ డ్రైనేజీ , సీసీరోడ్డు వేయాలని స్థానికుల డిమాండ్



రాయదుర్గం: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను ఆనుకొని ఉండే నానక్‌రాంగూడ అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గుంతలు.. బురదమయంగా మారాయి. నానక్‌రాంగూడలో శ్రీరామ్ స్కూల్‌కు వెళ్లే అంతర్గత రోడ్డు 365 రోజుల పాటు చిత్తడిగానే ఉంటుంది. డ్రైనేజీ కాలువల నుంచి మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. దీనికితోడు ఈ రోడ్డులో పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో ఇబ్బందికరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం పెద్ద సంఖ్యలో పిల్లలను స్కూలుకు తీసుకెళ్తుంటారు. రద్దీగా ఉండే ఈ రోడ్డు దుస్థితికి చేరడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నానక్‌రాంగూడలోని శ్రీరామ్ స్కూల్ రోడ్డులో భూగర్భడ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసిన తర్వాతే రోడ్డును బాగు చేయాలని స్థానికులు పేర్కొంటున్నారు.

వర్షాకాలం మరింత ఇబ్బందికరంగా..

నానక్‌రాంగూడలోని ప్రధానరోడ్డుకు ఈ రోడ్డు అనుసంధానంగా ఉండడంతో బాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు కూడా వెళుతుంటారు. ఇక వర్షాకాలం వరద నీరు, మురుగునీరు కలిసి పారుతుండడంతో





ప్రయాణం దుర్భరం అని స్థానికులు పేర్కొంటున్నారు. యుద్ధప్రాతిపదికన ఈ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

◆ తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ నానక్‌రాంగూడను దత్తత తీసుకొని పూర్తిస్థాయి మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సంత నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరుతున్నారు.



నానక్‌రాంగూడలో ..

టీజీఐఐసీ సంస్థ దత్తత తీసుకోవాలి



నానక్‌రాంగూడలో భూములను తీసుకున్న టీజీఐఐసీ సంస్థ మౌలిక వసతులు కల్పించాలి. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తోపాటు స్థానికులకు ఉద్యోగాలు కల్పించేలా కూడా చొరవ తీసుకోవాలి. నానక్‌రాంగూడలో పలు అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్‌రెడ్డి, నానక్‌రాంగూడ

ముగిసిన నృత్యోత్సవాలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సృజన జాతీయ నృత్యోత్సవాలు ఆదివారం ముగిశాయి. రాందాస్‌గ్రూప్ ఛత్తీస్‌గఢ్ ఫోక్ డ్యాన్స్, శ్రీకాంత్ గ్రూప్ అస్సామీ డ్యాన్స్, డాక్టర్ ప్రసన్నరాణి శిష్య బృందంచే కూచిపూడి, రాధాబృందంచే లంబాడి డ్యాన్స్, ఒడిస్సీ, కథక్, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎండి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి , డాక్టర్ ప్రసన్న రాణి తదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు.



పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం జూట్, బట్ట, జనుము వంటి వాటితో తయారు చేసిన చేతి సంచులనే వాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, పర్యావరణ పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ అన్నెం కోటి రెడ్డి అన్నారు. ×ప్లాస్టిక్ వద్దు అంటూ నగరంలోని వారాంతపు సంతలు, రైతు బజారులలో ఆదివారం జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటి బ్యాగులను పంపిణీ చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు .. అన్నదానం

మియాపూర్: మియాపూర్ ఏఎస్ రాజునగర్ కాలనీ టెంపుల్ పార్కులో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహాలను కె.రామకృష్ణ బహూకరించారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్, నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్, రామరాజు, కేశవులు, అరుణ్‌కుమార్, గణేష్ ముదిరాజ్, అరవింద్, వీరు, బాలాజీ, నర్సింగ్, రాము తదితరులున్నారు. అలాగే ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, వెంకటేష్‌యాదవ్, నరేందర్ బల్లా, కాలనీవాసులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

రాజీవ్ గృహకల్పలో కార్పొరేటర్ పర్యటన

శేరిలింగంపల్లి: సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని రాజీవ్ గృహకల్పలో పర్యటించారు.సీసీ రోడ్డు వేయనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు.అనంతరం గోపిచెరువులో ప్రధాన నాలా పనులు మధ్యలో నిలిపివేయడంపై హైడ్రా అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ భాస్కర్, కాలనీ అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, నాయకులు వెంకటేశ్వర్లు, బస్వరాజ్, చంద్రశేఖర్, బసవయ్య, కుటుంబరావు, యోగేశ్వరరావు, షఫీ, నర్సింహులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ పనులు.. ట్రాఫిక్ ఆంక్షలు



సూచిక బోర్డు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

నిజాంపేట్: మియాపూర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచుపల్లి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పనులు జరుగుతున్న క్రమంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. తాత్కాలికంగా బాచుపల్లి జంక్షన్‌ను మూసివేశారు. బాచుపల్లి జంక్షన్‌కు బదులుగా మల్లంపేట రోడ్డు నుండి మియాపూర్ రోడ్డు వైపు వచ్చే ట్రాఫిక్ ఎడమవైపునకు.. అంగారా రెస్టారెంట్ వద్ద యూ టర్న్ తీసుకుని మియాపూర్ రోడ్డు, నిజాంపేట్ రోడ్డు వైపు వెళ్ళవచ్చు. అలాగే నిజాంపేట్ రోడ్డు నుండి గండిమైసమ్మ రోడ్డు వైపు వచ్చే ట్రాఫిక్.. ఎడమవైపునకు – మమత హాస్పిటల్ వద్ద యూ టర్న్ తీసుకుని గండిమైసమ్మ రోడ్డు, మల్లంపేట రోడ్డు వైపు వెళ్ళవచ్చునని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. చందానగర్ పీజేఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ ఎస్ఐఎస్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు ఎంవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ముద్దనాస్ తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ క్రీడాకారులలో సృజనాత్మకతను వెలికితీయడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు.అనంతరం బ్యాడ్మింటన్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నరేందర్ బల్లా, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎమ్మెల్యే గాంధీ

పటేల్‌చెరువు పనులు పరిశీలన



చెరువు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్: చెరువుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ×షెక్స్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగావాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పటేల్ చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మియాపూర్ డివిజన్ పరిధిలో పటేల్ చెరువు, గురునాథం చెరువు, మక్తమహబూబ్‌పేట్ పెద్దకుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయినమ్మ కుంట చెరువు సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే చెరువుల రూపురేఖలు మారనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతి, ధర్మాన్ని రక్షించాలి

ఆల్విన్‌కాలనీ: కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట్ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ సెవెన్ హిల్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక ఉపనయనాలను నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన 9 మందికి వేద పండితులు దుర్గా చరణ్ ఉపనయన సంస్కార క్రతువులు నిర్వహించారు. డాక్టర్ మారేపల్లి భువనేశ్వరి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సభలో ప్రముఖ కవి, రచయిత రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. సంస్కృతి, ధర్మాన్ని పరిరక్షించడంలో అందరూ ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. అనంతరం గరిమెపూడి రాధాకృష్ణ మూర్తి, ప్రముఖ సినీ నటులు సుబ్బరాయ శర్మ, రామా వివేకానంద, డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మలు మాట్లాడారు. ఘంటసాల సంగీత సాధనాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాలాపన ఆహుతులను ఎంతగానో అలరించాయి. అనంతరం అన్నదానం చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

కార్యక్రమంలో సుధాకర్, నరసింహరావు, శ్రీనివాస్, కరుణాకర్, మాణిక్యాలరావు, శంకర్, రామారావు, లక్ష్మీనారాయణ, వెంకటరమణి, కల్యాణి, పార్వతి, బాల పరమేశ్వరి, పద్మావతి, జయశ్రీ, అనిత, ఛాయాదేవి, గౌరీ, కులకర్ణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గచ్చిబౌలి: ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని నూతన్‌కల్ జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థి డాక్టర్ మర్రి సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొండాపూర్‌లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ క్లబ్‌లో సూర్యాపేట జిల్లా నూతనకల్ జడ్పీహెచ్ఎస్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులైన చురుకంటి పవన్‌రెడ్డి, చురుకంటి అశోక్‌రెడ్డి, చురుకంటి శ్యామ్‌సుందర్‌రెడ్డిలు టీజీ పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ మెంబర్ ఆర్.రామ్మోహన్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజమల్లును సన్మానించారు.



నూతన్‌కల్ జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులను సన్మానించిన దృశ్యం

నేటి నుంచి సమ్మర్ క్యాంప్‌లు

మణికొండ: ప్రభుత్వం వేసవి సెలవుల్లో చేపట్టిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గండిపేట మండల విద్యాధికారి కె. విజయ్‌కుమార్ సూచించారు. వేసవిలో విద్యార్థులకు చిత్రలేఖనం, యోగా, పెయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, డిజిటల్ లెర్నింగ్, కథలు, చేతిరాత, ఇండోర్ గేమ్స్, పర్సనాలటీ డెవలప్‌మెంట్ లాంటి అంశాలను నేర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో హైదర్‌షాకోట్, కోకాపేట ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. 6 నుంచి 14 సంవత్సరాల బాలబాలికలు ఇందులో చేరవచ్చన్నారు.

మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణ మున్నూరు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు సపాన్‌దేవ్, శంకర్ యాదవ్, , ఆదర్శ్ రెడ్డి, నర్ర బిక్షపతి, సంఘం నూతన అధ్యక్షులు భోజయ్య, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పార్కు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అందరి సహకారంతో జీహెచ్ఎంసీ పరిధిలోని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని మల్లికార్జుననగర్ కాలనీలో రూ.55 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పార్కును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ సంక్షేమ సంఘం డైనింగ్ హాల్ ఏర్పాటుకు త్వరలో నిధులు ఇస్తామని తెలిపారు.కార్యక్రమంలో కార్పొరేటర్ పుష్ప, ఉప కమిషనర్ సురేష్, కాలనీ అధ్యక్షుడు రఘురాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్, నాయకులు ఐలేష్, పరమేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



'మిస్ వరల్డ్'తో మోక్షం..

- పాత ట్రాన్స్‌ఫార్మర్లు, తుప్పుపట్టిన స్తంభాల తొలగింపు
- రంగంలోకి దిగిన విద్యుత్ అధికారులు





బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, కేబుల్‌వైర్ల తొలగింపు

బంజారాహిల్స్: ప్రపంచ సుందరి పోటీలకు హైదరాబాద్ సిటీ ముస్తాబవుతోంది. మే 7 నుంచి 31 వరకు హైటెక్స్‌లో జరిగే పోటీల కోసం సుందరాంగులు నగరానికి చేరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో నగరాన్ని సుందరీకరించే దిశలో వివిధ శాఖలు సమన్వయంతో ముందుకుసాగుతున్నాయి. ముఖ్యంగా అందగత్తెలు రాకపోకలు సాగించే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న వైర్లు, తుప్పుబట్టిన కరెంటు స్తంభాల తొలగింపు, మరమ్మతులు చేస్తుంది. ఫిలింనగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సబ్‌స్టేషన్ల పరిధిలో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు, లైన్‌మెన్లు, సిబ్బంది ఆదివారం మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఈనెల 18న సుందరాంగులు రానున్న నేపథ్యంలో ఈ రోడ్డులో శిథిలావస్థకు చేరిన 12 ట్రాన్స్‌ఫార్మర్లను మార్చారు. తుప్పుబట్టిన కరెంటు స్తంభాల స్థానంలో కొత్తవి వేశారు. వేలాడుతున్న కేబుల్ వైర్లను సరిచేశారు. ప్రపంచ నలుమూలల నుంచి విచ్చేస్తున్న సుందరాంగులు తమ షెడ్యూల్‌లో భాగంగా వివిధ ప్రాంతాలను సందర్శించనున్నారు. అలాగే పోటీలు జరిగే హైటెక్స్‌కు కూడా ఈ ప్రాంతాల నుంచే వెళతారు. ఇక్కడ ఉన్న స్టార్ హోటళ్లలో వీరంతా బస చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ ప్రాంతాలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులు గత వారం రోజులుగా సుందరాంగులు రాకపోకలు సాగించే, పర్యటించే ప్రాంతాలను సర్వే చేశారు. రోడ్డు మార్గంలో వెళ్లే క్రమంలో ఎక్కడెక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు శిథిలావస్థకు చేరాయో వాటిని గుర్తించారు. వంగిన ట్రాన్స్‌ఫార్మర్ల జాబితాను తయారుచేశారు. దీని ఆధారంగానే ఆదివారం నుంచి మరమ్మతులు చేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు ఈ పనులు కొనసాగనున్నాయి.టీజీఎస్‌పీడీసీఎల్ ఫిలింనగర్ సబ్‌స్టేషన్ ఏఈ పవిత్ర పర్యవేక్షణలో 30 మంది సిబ్బంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. దాదాపు అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలోనూ పనులు చేస్తున్నారు.